క్లుప్తంగా

ఫ్యాన్లు, జారుడుబల్లల పంపిణీ



ఫ్యాన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

పోలాకి: మండలంలోని 88 అంగన్‌వాడీ కేంద్రాలకు ఫ్యాన్లు, జారుడుబల్లలను మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ బుధవారం పంపిణీ చేశారు. వీటిని మండల పరిషత్‌కు చెందిన ప్రత్యేక స్త్రీశిశు సంక్షేమ నిధుల నుంచి సమకూర్చినట్లు ఎంపీడీఓ ఈశ్వరరావు తెలిపారు. ఎంపీపీ ముద్దాడ దమయంతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

72 మందికి వైద్య పరీక్షలు

కొత్తూరు: మండలంలోని కురిగాం పీహెచ్‌సీ పరిధి పానుటూరు, మాతల గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి రామకృష్ణ 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అవసరమైన వైద్యం కోసం కొత్తూరు సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ఈ రెండు గ్రామాల్లో నిర్వహించిన శిబిరాలు కురిగాం పీహెచ్‌సీ ఈఓ బుజ్జిబాబు పర్యవేక్షణలో జరిగాయి. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

రూ.5 లక్షల వైఎస్సార్ బీమా అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన కూన పొట్టెమ్మ గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ ప్రమాద బీమా పథకం కింద రూ.5 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. సర్పంచ్ సాగిపల్లి దండాశి, ఎంపీటీసీ పంచిరెడ్డి జ్ఞానేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వరుదు వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న వెంకట సత్యనారాయణ

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో సంక్రాంతి పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ యువజన ప్రధాన కార్యదర్శి చిన్నాల వెంకట సత్యనారాయణ మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. చిన్నల రామసత్యనారాయణ జ్ఞాపకార్థం గ్రామంలోని విద్యార్థులకు సంక్రాంతి మూడు రోజులు వివిధ ఆటల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు పంపిణీ చేశారు. చిన్నాల లక్ష్మీనారాయణ, యాళ్ల రఘు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నగదు, దుస్తుల వితరణ



దుస్తులు, నగదు, తదితర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని ఉప్పినివలసలో జిల్లా సత్య సాయి సంస్థ పదాధికారి ఎం.జనార్దన రావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన తూతిక కృష్ణవేణి, గణపతిరావు దంపతులు, వీరభద్రరావు, లక్ష్మి దంపతులు సమకూర్చిన ఆర్థిక సహాయంతో అదే గ్రామానికి చెందిన నిరుపేదలకు వితరణ చేశారు. గ్రామంలో బుధవారం జరిగిన నారాయణ సేవలో 12 మంది నిరుపేదలకు మధ్యాహ్నం భోజనం తోపాటు, పండ్లు, వస్త్రాలు, స్వామివారి ఫొటోలు, కొంత మొత్తం నగదు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఉప్పినివలస భజన మండలి కన్వీనర్ అల్లాడ సింహాచలం, వేణంపేట సమితి కన్వీనర్ చీడిపోతు సూర్యారావు, వీరయ్య, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి



పీఏసీఎస్ సీఈఓ శాస్త్రి

బూర్జ: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో వ్యవసాయ రుణాలు పొందిన లబ్ధిదారులు ఫిబ్రవరి 20 తేదీలోగా రెన్యువల్ చేసుకోవాలని సీఈఓ శాస్త్రి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. రెన్యువల్ చేసేవారు 4 శాతం వడ్డీ చెల్లించి ప్రభుత్వం కల్పించిన రాయితీని పొందవచ్చన్నారు. దీనిలో 50 సెంట్లుకు రూ.లక్ష, 76 సెంట్లుకు రూ.2 లక్షలు, ఎకరా 50 సెంట్లుకు ఎస్సీ, ఇతరులకు రూ.4 లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తాన్నారు. దీని కోసం రైతులు ఈకేవైసీ చేసుకున్న పాస్ పుస్తకం, ఆధార్, పాలకొండ కోఆపరేటివ్ బ్యాంకు ఖాతా పుస్తకం, పాస్ ఫొటోలు జత చేసి కార్యాలయానికి అందజేయాలన్నారు. పూర్తి వివరాలను ఫోన్ 9394751346, 9704996232 నంబర్లను సంప్రదించాలన్నారు.



నరసన్నపేట: విశాఖపట్నం వైపు వెళ్లేందుకు కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణం

- కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు
- ప్రైవేట్ వాహనాను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఎల్.ఎన్.పేట: సంక్రాంతి పండగ ముగిసింది. ప్రభుత్వం ఇచ్చిన సెలవులు పూర్తయ్యాయి. గురువారం నుంచి పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సినవారు, స్వంత గ్రామాలకు, అత్తవారి ఊర్లకు వచ్చిన కుటుంబ సభ్యుల తిరుగుప్రయాణమయ్యారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర ప్రయాణ వాహణాల్లో కిక్కిరిసిన ప్రయాణం చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి చీకటి పడేంత వరకు ప్రయాణికులు రోడ్లు పక్క వేచి ఉన్నా కిక్కిరిసిన ప్రయాణం తప్పలేదు. బస్సులోకి ఎక్కలేని పరిస్థితులు ఏర్పడ్డంతో ఏం చేయాలో తెలియని ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ ఆర్డినరీ బస్సు సర్వీసులు శ్రీకాకుళం నుంచి కొత్తూరు, బత్తిలి రూట్లలో అంతంత మాత్రంగా నడపటంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వారం రోజుల పాటు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాలకు చెందిన పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

నరసన్నపేట: స్వగ్రామంలో సంక్రాంతి పండగ నిర్వహించుకురని తిరిగి వెళ్లున్న వారితో ఆర్టీసీ కాంప్లెక్స్, బస్సులు కిటకిటలాడాయి. బుధవారం ఉదయం నుంచే రద్దీ కొనసాగింది. ప్రధానంగా శ్రీకాకుళం, విశాఖపట్నం వైపు వెళ్తున్న బస్సుల్లో రద్దీ కనిపించింది.



ఎల్.ఎన్.పేట: ఆటో ప్రయాణం ఇలా..



ఎల్.ఎన్.పేట: కిక్కిరిసినట్లు ఉన్న ఆర్టీసీ బస్సు



నరసన్నపేట: బస్సు రావడంతో ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న ప్రయాణికులు

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గడపగడపకు మన ప్రభుత్వానికి విశేష స్పందన

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందిస్తూ.. సమస్యలను పరిష్కరిస్తానన్నారు. జగనన్న పాలన జనరంజకంగా ఉందన్నారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, పింఛన్ కానుక, ఇళ్ల స్థలాలు, అమ్మ ఒడి పథకం అందాయని పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో ఇంత మేలు జరగలేదన్నారు. మళ్లీమళ్లీ జగనన్నే సీఎం కావాలన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే అన్నారు. జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎంపీటీసీ సలాన చిట్టి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, పల్లి యోగి, కె.శశిభూషణరావు, పి.జయమునిరావు, రుషి, అనపాన రాజు, బమ్మిడి పున్నయ్య, కన్న బాబు, రవికుమార్, రామరాజు, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గురువులు సమాజ నిర్దేశకులు



సన్మాన కార్యక్రమంలోఉపాధ్యాయులు

జలుమూరు: గురువులు సమాజ నిర్దేశకులని యలమంచిలి సర్పంచ్ మెండ రవి అన్నారు. బుధవారం యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధనకు మరింత కృషితోపాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడిన ఉపాధ్యాయులు అందరూ మరింత బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఈ ఏడాది ట్రిపుల్ టీ సీట్లు సాధించిన బైరి ఇందిర, వంజరాపు సునీతలకు సర్పంచ్ రవి తన స్వంత నిధులు రూ.5 వేలు చొప్పున అందించారు. ఈ విద్యార్థులకు జుత్తు సింహాచలం పుస్తకాలు, విద్యా సమాగ్రి సమకూర్చారు. ఎంఈఓ బి.మాధవరావు, హెచ్ఎం రఘు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి వచ్చిన మంటలు


నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు బుధవారం సాయంత్రానికి అదుపులోనికి వచ్చాయి. సోమవారం రాత్రి ప్రారంభమైన మంటలు మంగళవారానికి దావానంలా ఎగిసిపడ్డాయి. దీంతో సమీపంలోని జగన్నాథపురంలో పలు ఇళ్లకు అధికంగా దుర్వాసన, పొగ, వేడి పెరిగింది. దీంతో వీధి వాసులు ఆందోళన చెందారు. సమీప పొలాలపై కూడా దీని ప్రభావం ఉంటుందని భావించారు. ఆ వీధి వాసులు సర్పంచ్ బూరల్లి శంకర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ సూచనలతో ఈఓ సింహాద్రి వెంటనే మంటలను అదుపులోనికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక సిబ్బందితో డంపింగ్ యార్డ్‌కు చేరుకుని మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. ప్రస్తుతం పొగ అధికంగా వస్తుందని దీనిని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న చెత్త దాదాపుగా కాలిబూడిదైంది.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇనాం భూ సమస్యలు పరిష్కరిస్తాం

మెళియాపుట్టి: ఇనాం భూముల వల్ల సమస్యలు రాకుండా చూస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మారడికోట గ్రామ పంచాయతీలో రైతులతో సమావేశమయ్యారు. ఇనాం భూముల సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని, వాటి యజమానులకు ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. భూములకు సంబంధించిన ధ్రువపత్రాలు రెవెన్యూ అధికారులకు అందజేయాలని, అర్హతకలిగిన వారికి న్యాయం చేస్తామన్నారు. అనంతరం కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన శుద్ధ జల ప్లాంట్‌ను పరిశీలించి, శుద్ధజలాన్ని ప్రతీఒక్కరూ వినియోగించాలన్నారు. తహసీల్దార్ సరోజిని, సర్పంచ్ పెద్దింటి భాగ్యం, కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక డ్రైవ్

కొత్తూరు: మండలంలోని కొత్తూరు-1, మధనాపురం, కర్లెమ్మ గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని మండల పరిషత్ కార్యాలయ ఏఓ డి.చిన్నమ్ముడు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఆధార్ కార్డు నమోదుతోపాటు కార్డులో మార్పులు, చేర్పులు, 2006 ముందు ఆధార్ కార్డు పొందినవారు నూతనంగా ఆధార్ కార్డులు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఈ నమోదు కార్యక్రమం ఈ నెల 19, 20, 21, 23, 24 తేదీలతోపాటు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవత ఉత్సవాలు



గ్రామదేవత ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

సారవకోట: మండలంలోని తొగిరి పంచాయతీ కొమ్ముపలస గ్రామంలో మంగళవారం నుంచి గ్రామదేవత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా బుధవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేపట్టనున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలే కీలకం

పాతపట్నం: గ్రామ పంచాయతీల ఆదాయాభివృద్ధికి కీలకమైన జీపీడీపీ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిపై ఉందని ఈఓపీఆర్డీ ఎస్.ప్రసాద్ పండా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అభివృద్ధి ప్రణాళికలపై సమావేశం నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ఆదాయాభివృద్ధి మార్గాలను అన్వేషించి, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సంక్రాంతి ముగిసినందున జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

ఆమదాలవలస: మండలంలోని నిమ్మతొర్లువాడ గ్రామం సమీపంలో 11 మద్యం బాటిళ్లతో అదే గ్రామానికి చెందిన సోమరాజు చంద్రశేఖర్ అనే వ్యక్తి బుధవారం ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు ఎస్ఈబీ సీఐ కె.సునీల్‌కుమార్ తెలిపారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది వైకుంఠరావు, తేజావతి, రమణమూర్తి పాల్గొన్నారు.

లబ్బలో వైఎస్సార్ పొలం బడి

కొత్తూరు: రబీ వరి నారులో కాండం తొలుచు పురుగు నివారణ కోసం ఇంగువ, పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ అన్నారు. లబ్బ గ్రామంలో ఎనిమిదో విడత వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మరో వారం రోజుల్లో వరి నాట్లు వేయనున్న నారును ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో కలిసి పరిశీలించారు. వరి నారులో కాండం తొలుచు పురుగులు ఉన్నట్లు గుర్తించారు. ఇంగువ ద్రావణంతోపాటు పలు రకాల ద్రావణాలు, కషాయాలు తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీముఖలింగేశ్వరుడి తిరువీధి





అలంకరణలో పార్వతీపరమేశురుల విగ్రహాలు, తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి కార్యక్రమం బుధవారం పుష్యమాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఏకవారాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను చక్కగా అలకరించి పల్లకిలో ఆశీలను చేసి తిరువీధి నిర్వహించారు. భక్తులు హారతులు ఇచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ పంటల నమోదు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రబీలో సాగవుతున్న పంటలకు సంబంధించి ఈ-పంట నమోదు చేస్తున్నట్లు ఏఓ పైడి లతశ్రీ బుధవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ శాఖ సహాయకుల ఆధ్వర్యంలో రైతులను పంట పొలాలకు తీసుకుని వెళ్లి ఈ-పంట నమోదు చేస్తున్నామన్నారు. వాడవలస, సిద్ధాంతం, సుమంతాపురం, కొత్తపేట, కవిటి తదితర గ్రామాల్లో రైతులతో కలిసి పొలాలకు వెళ్లామన్నారు. ప్రస్తుతం ఉన్న పంటను, సర్వే నంబర్లను నమోదు చేసి ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు.



ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

కొత్తూరు: భారత రత్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాతల గ్రామ సర్పంచ్ కలమట సుప్రియ అన్నారు. మాతల కాలనీలో అంబేడ్కర్, పూలే వారుసుల ఐక్య వేదిక కొత్తూరు శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు జర్జాన తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. అంబేడ్కర్‌ను యుతకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడుగుల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ చేసిన కృషిని గుర్తుచేశారు. ఎస్సీ సామాజిక భవనం మంజూరైందన్నారు. దళితుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. వీఆర్వో కలమట రమేష్‌బాబుతోపాటు పలువురు అంబేడ్కర్ ఔన్నత్యాన్ని వివరించారు. ఐక్యవేదిక ప్రతినిధులు తొగిరి రవి, డి.జమ్మయ్య, బి.గుమ్మయ్య, బి.రామకృష్ణ, బి.శ్రీనివాసరావు, ఆర్.ఆనంద్, సి.హెచ్. రాంబాబు, ఎం.మహేంద్రకుమార్, టి.అనీల్, కె.నాగభూషణరావు, ఎస్.మన్మథరావు, బి.కృష్ణారావు, ఎస్.జగజ్జీవనరావు, గ్రామ పెద్దలు, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్ కలమట సుప్రియ

సామాజిక వేడుకలు నిర్వహించాలి

కొత్తూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి నెల ఒకటో, మూడో బుధవారాల్లో సామాజిక వేడుకలు నిర్వహించాలని కొత్తూరు సీడీపీఓ టి.విమలారాణి తెలిపారు. కొత్తూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సామాజిక వేడుకలను పరిశీలించారు. ఈ వేడుకలకు గర్భిణులు, బాలింతలను ఆహ్వానించాలన్నారు. ఇటువంటి వేడుకలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు పోషక ఆహారాల ఉపయోగాలతోపాటు పలు రకాల అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనాలు పెట్టాలన్నారు. ఉదయం పాలు, గుడ్లు కేంద్రంలోనే అందజేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుధావాణి, కొత్తూరు-1 అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ విమలరాణి

• జ్ఞాపకాల బడిలో..



ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

హిరమండలం: తులగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా బుధవారం ఒకేచోటకు చేరి సందడి చేశారు. హిరమండలంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆత్మీయసమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.